## గ్యార్వీ పండుగ శుభాకాంక్షలు



ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని సన్మానించిన ముస్లింలు

గ్యార్వీ ఉత్సవాలను పురస్కరించుకుని కొండాపూర్ డివిజన్ పరిధి అంజయ్యనగర్‌లో ముస్లింలు ఘనంగా నిర్వహించారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొని గ్యార్వీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మాజీ కార్పొరేటర్ నీలం రవిందర్ ముదిరాజ్, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

– కొండాపూర్, అక్టోబర్ 28

## ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ప్రభుత్వ విప్

మియాపూర్ అక్టోబర్ 28 : ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని, మంచి అలవాట్లు, వ్యాయామం చేస్తూ ముందుకు సాగాలని విప్ ఆరెకపూడి గాంధీ పిలుపునిచ్చారు. కూకట్‌పల్లి డివిజన్ ఆబ్సెస్టాస్ కాలనీలో కల్వరి హాస్పటల్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని విప్ గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం వ్యాపార ధోరణితోనే కాకుండా దవాఖానలు క్షేత్రస్థాయిలో ఉచిత వైద్య సేవలను నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాగేశ్వర్‌రావు, అబుల్, కృష్ణ, ఖయ్యూమ్, రఫిక్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు



నృత్య ప్రదర్శనలిస్తున్న కళాకారులు మహేశ్‌గౌడ్

కొండాపూర్, అక్టోబర్ 28 : వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం మాదాపూర్‌లోని శిల్పారామంలో పలువురు కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. తాండవ ఆర్ట్స్ కూచిపూడి డాన్స్ అకాడమీ గురువులు మధుసూదన్ తన శిష్య బృందంతో కలిసి కూచిపూడి నృత్య ప్రదర్శనలిచ్చారు. తాండవ నృత్యకారి, శివాష్టకం, భామాకలాపం, జయదేవ అష్టపది, గజవదన బేడువే, శివరంజని తిల్లాన, ఆధ్యాత్మ రామాయణ కీర్తన, ఆనంద తాండవం, జయము జయము లలితకలవానికి, దేవదేవం భజే, మరకత మణిమయ అంశాలను అద్వైత, వైష్ణవి, సాత్విక, రిత్విక, శుక్తాచారి, సునీతలు కూచిపూడి నృత్యరూపకంలో నర్తించిన తీరు ఆకట్టుకుంది.

## పోలీస్ బెటాలియన్‌లో రక్తదాన శిబిరం




రక్తదాన శిబిరంలో పాల్గొన్న కమాండెంట్ సన్నీ

కొండాపూర్, అక్టోబర్ 28 : రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని కొండాపూర్ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ సీ. సన్నీ అన్నారు. పోలీసు వారోత్సవాల్లో భాగంగా శనివారం కొండాపూర్ పోలీస్ బెటాలియన్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కమాండెంట్ సన్నీ మాట్లాడుతూ.. కొవిడ్ అనంతరం రక్త నిల్వలు తగ్గిపోయాయని, ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలన్నారు. అత్యవసర సమయంలో సరైన రక్తం లభించక ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. రక్తదానంపై ప్రతి ఒక్కరిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో అదనపు కమాండెంట్ కే సుబ్రమణ్యం, అసిస్టెంట్ కమాండెంట్లు వీ. నరసింహస్వామి, డీ. సత్యనారాయణ దాసు, యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జ్యోతి బాపులే, రెడ్‌క్రాస్ సొసైటీ మెడికల్ ఆఫీసర్ జనార్దన్, బెటాలియన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మా మద్దతు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకే..

- ముక్తకంఠంతో నినదించిన గచ్చిబౌలి నాగార్జున రెసిడెన్సీ వాసులు
- ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ



ఎన్‌సీసీ రెసిడెన్సీలో ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ హమీద్ పటేల్



నలగండ్ల కూరగాయాల మార్కెట్‌లో అగ్నిప్రమాదంలో కాలిపోయిన దుకాణాలను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ


కొండాపూర్, అక్టోబర్ 28 : ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనను మెచ్చి గచ్చిబౌలిలోని నాగార్జున రెసిడెన్సీ వాసులు స్వచ్ఛందంగా ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకి మద్దతు ప్రకటించారు. శనివారం గచ్చిబౌలిలోని ఎన్‌సీసీ రెసిడెన్సీలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ హమీద్ పటేల్‌తో కలిసి పాల్గొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని, ప్రజలు సంతోషంగా ఉన్నారని, భవిష్యత్తులో ఇదే పాలనను తాము కోరుకుంటున్నామని ఎన్‌సీసీ వాసులు తెలిపారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి అరెకపూడి గాంధీకి తమ పూర్తి మద్దతు ఉంటుందని, వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. అనంతరం గాంధీ మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నానని, ప్రజలకు అవసరమైన సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరాయంగా కృషి చేస్తున్నానన్నారు. గేటెడ్ కమ్యూనిటీలతో సమానమైన మౌలిక సదుపాయాలను బస్తీలు, కాలనీల్లో కల్పించడంలో విజయవంతమైనట్లు తెలిపారు. ప్రజలు సంతోషంగా ఉన్నప్పుడే నాయకుడు సంతోషంగా ఉంటాడని, ప్రజలు స్వచ్ఛందంగా బీఆర్ఎస్‌కు మద్దతు పలకడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ రెసిడెన్సీ వాసులు పాల్గొన్నారు.

### అగ్నిప్రమాద బాధితులకు అండగా ఉంటా..

శేరిలింగంపల్లి : నలగండ్ల కూరగాయల మార్కెట్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన దుకాణదారులకు అన్ని విధాలా అండగా ఉంటానని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని నలగండ్ల కూరగాయల మార్కెట్‌లో అగ్ని ప్రమాదానికి గురైన దుకాణాలను శనివారం ఆయన పరిశీలించి బాధిత దుకాణదారులతో మాట్లాడి ప్రమాదం జరిగిన తీరును తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అగ్ని ప్రమాదం జరగడం దురదృష్టకరమని, ఎవరూ అధైర్య పడొద్దని బాధితులకు అండగా ఉంటానని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మారబోయిన రాజుయాదవ్, సీహెచ్. రవీందర్‌గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, పద్మారావు, కృష్ణయాదవ్, నలగండ్ల కూరగాయల మార్కెట్ ప్రతినిధులు ఖాజపాషా, ఫక్రుద్దీన్, అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమమే బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయి..

- బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారంలో కార్పొరేటర్ మంజులారఘునాథ్‌రెడ్డి



చందానగర్‌లో ఇంటింటి ప్రచారంలో కార్పొరేటర్ మంజులారఘునాథ్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

కొండాపూర్, అక్టోబర్ 28 : అభివృద్ధి, సంక్షేమమే ఊపిరిగా ముందుకు సాగుతున్న బీఆర్ఎస్‌ను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చందానగర్ కార్పొరేటర్ మంజులారఘునాథ్‌రెడ్డి అన్నారు. చందానగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో శనివారం కార్పొరేటర్ స్థానిక ఎమ్మెల్యే కుమారుడితో కలిసి ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమాలకు కేరాఫ్‌గా నిలుస్తున్న బీఆర్ఎస్‌కు ప్రజలు స్వచ్ఛందంగా మద్దతు తెలుపుతున్నారన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్న అరెకపూడి గాంధీని ముచ్చటగా మూడోసారి గెలిపించాలని ప్రజలను కోరారు. బస్తీలు, కాలనీలు అనే తేడా ? లేకుం డా ప్రజలకు అన్ని మౌలిక సదుపాయాలు 100 శాతం కల్పించారని అన్నారు. మరోసారి అరెకపూడి గాంధీని భారీ మెజార్టీతో గెలిపించేందుకు అన్ని వర్గాల ప్రజలు ముందుకువస్తుండటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం ఖాయం



వెంకట పాపయ్యనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో సమావేశమైన కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్‌గౌడ్

మియాపూర్ , అక్టోబరు 28 : ప్రజల మద్దతుతో అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేస్తుందని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్ పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని వెంకట పాపయ్యనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో శనివారం కార్పొరేటర్ సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధికి వంద కోట్ల రూపాయలు మంజూరు చేయించి అనేక మౌలిక వసతులను కల్పించారని అన్నారు. ప్రజలంతా ఓటేసి గాంధీని గెలిపిస్తే భవిష్యత్‌లో మరిన్ని నిధులు మంజూరు చేయించి మరింత అభివృద్ధి చేస్తారని పేర్కొన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే గాంధీని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని కార్పొరేటర్ కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నేతలు, కాలనీ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## పద్యనాటక రచనలో శర్మకు ప్రథమ బహుమతి



రచయిత కటకం వెంకటరామశర్మ

మియాపూర్ , అక్టోబరు 28 : ప్రజా–పద్యం ఆధ్వర్యంలో ఆధునిక సామాజిక స్పర్థ నిర్వహించిన రాష్ట్ర స్థాయి పద్య నాటక రచన పోటీల్లో మియాపూర్ హెచ్ఎంటీ స్వర్ణపురి కాలనీకి చెందిన విశ్రాంత మండల విద్యాధికారి, ప్రముఖ కవి, రచయిత కటకం వెంకటరామ శర్మకు ప్రథమ బహుమతి లభించింది. తెలుగు భాషాభివృద్ధికి పాటుపడుతున్న ప్రజా–పద్యం సంస్థ ఈ పోటీలను ఈ ఏడాది జనవరిలో నిర్వహించింది. తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల నుంచి సుమారు 100 వరకు ఎంట్రీలు వచ్చాయి. వాటన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించిన నిర్వాహకులు, 21 ఎంట్రీలను పరిగణనలోకి తీసుకున్నారు. వాటిని లోతుగా అధ్యయనం చేసిన న్యాయ నిర్ణేతలు ఏసీపీ శాస్త్రి, మత్తి భానుమూర్తి, అవసరాల వెంకట్రావ్ విశ్రాంత విద్యాధికారి కటకం వెంకట్రామ శర్మ రచించిన 'బృహన్నర' నాటకం ఉత్తమమైన రచనగా గుర్తించారు. ఆదివారం కూకట్‌పల్లిలోని భారత వికాస పరిషత్ ఛారిటబుల్ ట్రస్ట్‌లో నిర్వహించనున్న కార్యక్రమంలో శర్మకు బహుమతితోపాటు రూ. 5 వేల నగదు ప్రోత్సాహకంగా అందివ్వనున్నారు. శర్మను ప్రజా పద్యం నిర్వహకులు నారుమంచి వెంకట అనంతకృష్ణ, మారేపల్లి వెంకట పట్వర్ధన్, వీఆర్ గణపతి సహా పలువురు రచయితలు అభినందించారు.

## వృద్ధుడు అదృశ్యం



అదృశ్యమైన కమలాకర్‌రావు(ఫైల్)

కుత్బుల్లాపూర్, అక్టోబర్ 28: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వృద్ధుడు అదృశ్యమైన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. సీఐ ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. జీడిమెట్ల డివిజన్ శ్రీని అవెన్యూ ఎన్‌క్లేవ్ ప్రాంతానికి చెందిన కమలాకర్ రావు(72) శనివారం తెల్లవారుజామున ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 100, 9490617229 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.